సాక్షి
అనకాపల్లి
సోమవారం ׀ 5 ׀ ఫిబ్రవరి ׀ 2024



రైతుల సంక్షేమానికి పెద్దపీట

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్ భవనాలకు ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. 8లో



విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి

జోగుంపేట ఎస్సీ హాస్టల్లో విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. 8లో



వైఎస్సార్‌సీపీలో చేరికలు

మాడుగుల, చీడికాడ, చోడవరం మండలాల్లో టీడీపీ, జనసేనల నుంచి పలువురు నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. 8లో

న్యూస్‌రీల్

సరుగుడు జలపాతం వద్ద పర్యాటకుల సందడి



జలపాతంలో జలకాలు ఆడుతున్న సందర్శకులు

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులు సందడి చేశారు. ఎత్తైన రెండు కొండల మధ్యలోంచి వచ్చే నీటిలో జలకాలు ఆడేందుకు పోటీ పడ్డారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి వాహనాలపై అధిక సంఖ్యలో సందర్శకులు ఇక్కడికి వచ్చారు. తాండవ రిజర్వాయర్ వద్ద కూడా సందర్శకులు సందడి చేశారు.

నిందితుల కోసం ముమ్మర గాలింపు

- తహసీల్దార్ హత్య కేసులో ఇద్దర్ని విచారించిన పోలీసులు
- బెంగళూరు వెళ్లిన రెండు బృందాలు

పీఎంపాలెం: నగరంలో సంచలనం సృష్టించిన తహసీల్దార్ రమణయ్య హత్యకేసు నిందితుల కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. హత్య చేసిన తరువాత నిందితుడి విమానంలో బెంగళూరు వెళ్లినట్టు నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలో రెండు పోలీసు బృందాలను అక్కడకు పంపినట్టు తెలిసింది. హత్యా సంఘటనలో ప్రమేయం ఉన్నట్టు భావిస్తున్న మధురవాడ ప్రాంతానికి చెందిన ఇద్దరు అర్చకులను ఇప్పటికే పోలీసులు విచారించారు. హత్యకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు మరింత వేగవంతం చేశారు. వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, ఇప్పటికే నిందితుల కోసం పది పోలీసు బృందాలు గాలిస్తున్నట్టు సీఐ రామకృష్ణ తెలిపారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు మరో అవకాశం

ఈ నెల 10 వరకు గడువు

యలమంచిలి రూరల్: ఈ ఏడాది మార్చి నెలలో జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు ఇప్పటి వరకు పరీక్ష ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తత్కాల్ స్కీమ్ కింద రూ.3 వేల అపరాధ రుసుము చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి బి.సుజాత ఆదివారం సాయంత్రం తెలిపారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. ఇంటర్ చదివే ఒకేషనల్, జనరల్ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పరీక్ష ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరు కావాలని ఆమె సూచించారు.

పాడి రంగానికీ ఆర్బీకేల దన్ను..

సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు, సంపూర్ణ మిశ్రమ దాణా పంపిణీ



కోటవురట్ల మండలం ఆక్సాపేట గ్రామానికి చెందిన రైతు ఎ.చిట్టిబాబుకు రెండు గేదెలు, రెండు ఆవులున్నాయి. గతంలో మార్కెట్‌లో దొరికే నాసిరకం దాణా వినియోగించటం వల్ల ఆశించిన స్థాయిలో పాల దిగుబడి వచ్చేది కాదు. పైగా పశువులు తరచూ అనారోగ్యం బారిన పడేవి. దీంతో ఆర్బీకేల ద్వారా ఇస్తున్న నాణ్యమైన సంపూర్ణ మిశ్రమ దాణా (టీఎంఆర్) తీసుకోవడం మొదలుపెట్టాడు. ఇప్పుడు అతడి పశువులు రోజుకు 1–2 లీటర్ల పాలను అధికంగా ఇస్తున్నాయి. ఆ పాలలో వెన్న శాతం కూడా పెరగడంతో మంచి ఆదాయం వస్తోందని చెప్పాడు. తానిప్పటి వరకు కిలో రూ.6.50 చొప్పున 150 కిలోల టీఎంఆర్ తీసుకున్నానని, అదేవిధంగా సబ్సిడీ మీద 5 కిలోల గడ్డి విత్తనాలను కూడా తీసుకున్నట్లు చిట్టిబాబు ఆనందంతో చెబుతున్నాడు.

సాక్షి, అనకాపల్లి: వ్యవసాయానికే కాక పాడి రంగానికీ రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు) దన్నుగా నిలుస్తున్నాయి. పాడి పశువులకు నాణ్యమైన పశుగ్రాసం, దాణా అందిస్తే అధిక దిగుబడితోపాటు నాణ్యమైన పాలను ఇస్తాయి. రోగాల బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటాయి. నాణ్యమైన పాల దిగుబడి వస్తే పాడి రైతుల ఆదాయానికి ఢోకా ఉండదు. ఇన్నాళ్లూ పశుగ్రాసం, దాణా కోసం పాడి రైతులు పాట్లు పడేవారు. వాటికి చెక్ పెడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా పశుగ్రాస విత్తనాలు, సంపూర్ణ మిశ్రమ దాణా (టీఎంఆర్) తదితర పోషక మిశ్రమాలతోపాటు గడ్డి కత్తిరించే యంత్రాలు (చాఫ్ కట్టర్స్) వంటి వాటిని సబ్సిడీపై ఇస్తుండటంతో రైతుల వెతలు తీరుతున్నాయి. ఆర్బీకేల ద్వారా సర్ఫై చేసిన నాణ్యమైన పశుగ్రాస విత్తనాలను 75 శాతం సబ్సిడీతో అందిస్తున్నారు. జిల్లాలో డిమాండ్ ఎక్కువగా ఉన్న సీఎస్‌హెచ్–24 జొన్న రకం పశుగ్రాస విత్తనాలను, మొక్కజొన్న విత్తనాలను రైతులు ఎక్కువగా తీసుకుంటున్నారు. 20 సెంట్ల నుంచి ఎకరం వ్యవసాయ పొలం కలిగిన సన్న, చిన్నకారు రైతులకు 5 నుంచి 20 కిలోల వరకు సరఫరా చేస్తున్నారు. రైతులు ఆర్బీకేల్లో భూమి పాస్ పుస్తకం నకలు సమర్పించి విత్తనాలను సబ్సిడీపై తీసుకునే అవకాశం వ్యవసాయ శాఖ కల్పించింది.



ఆర్బీకేల్లో పశుగ్రాస విత్తనాలు అందిస్తున్న అధికారులు (ఫైల్)

ఆర్బీకేల ద్వారా సరఫరా

మిశ్రమ దాణా **794.8** మెట్రిక్ టన్నులు

విత్తనాలు **49.80** మెట్రిక్ టన్నులు

పాడి రైతుకు అండగా..

జిల్లాలో ఆర్బీకేల ద్వారా 794.8 మెట్రిక్ టన్నుల సంపూర్ణ మిశ్రమ దాణా రైతులకు పంపిణీ చేశారు. ఇప్పటివరకు 49.80 మెట్రిక్ టన్నుల విత్తనాలను అందించారు. అదేవిధంగా 218 గడ్డి కత్తిరించు యంత్రాలను సరఫరా చేశారు.

- జిల్లాలో 11.52 టన్నుల సీఎస్‌హెచ్–24 రకం జొన్న విత్తనాలు అందించారు. ఎకరానికి కావలసిన 15 కేజీల విత్తనాల మార్కెట్ ధర 460 వరకు ఉంటే.. ప్రభుత్వ సబ్సిడీ 75 శాతం పోను రైతులు చెల్లించవలసింది రూ.115 మాత్రమే. ఈ పశుగ్రాసంలో మాంసకృతులు 7 నుంచి 8 శాతం వరకు ఉంటాయని పశువైద్యులు వెల్లడించారు. ఈ రకం జొన్న కీటకాలు, తెగుళ్లు రాకుండా తట్టుకోగలదు.
- జిల్లాలో 8.08 టన్నుల ఆఫ్రికన్ టాల్ రకం మొక్కజొన్న విత్తనాలు, 15.44 టన్నుల ఈసీ 4215 రకం అలసంద విత్తనాలు, 1.7 టన్నుల సజ్జ విత్తనాలు అందించారు.

సత్ఫలితాలతో రైతుల్లో ఆనందం



ఆర్బీకేల ద్వారా సర్ఫై చేసిన నాణ్యమైన పశుగ్రాస విత్తనాలు, పశుదాణా అందించడంతో సత్ఫలితాలు వస్తున్నాయి. నాణ్యమైన విత్తనాలను 75 శాతం సబ్సిడీకే అందిస్తున్నాం. అర్హత, ఆసక్తి కలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సమీప ఆర్బీకేల్లోని పశుసంవర్ధక సహాయకులను సంప్రదించండి. సీఎస్‌హెచ్–24 విత్తనాలతో సత్ఫలితాలు వస్తున్నాయని చాలామంది రైతులు చెప్పారు. సచివాలయ పశుసంవర్ధక సహాయకులతో క్షేత్ర స్థాయి విజిట్ చేసి ఈ విషయం నిర్ధారించుకున్నాం.

– డాక్టర్ ప్రసాదరావు, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్

పీఏసీఎస్ చైర్మన్ల పదవీ కాలం పొడిగింపు

కొన్ని చోట్ల మార్పులు చేర్పులు



విశాఖలోని డీసీసీబీ కార్యాలయం

విశాఖ విద్య: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్/ఎఫ్ఎస్‌సీఎస్/ ఎల్ఎస్‌సీఎస్) పదవీ కాలం పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కార్యకలాపాలను కొనసాగించాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారులకు సమాచారం అందింది. డీసీసీబీ పరిధిలో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 98 పీఏఎస్‌సీలకు ఇప్పటి వరకు పనిచేస్తున్న పాలక మండళ్లు ఈ ఏడాది జూలై 30 వరకు లేదా వీటికి ఎన్నికలు నిర్వహించేంత వరకు యథావిధిగా కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే కొన్ని చోట్ల నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా చైర్‌పర్సన్, సభ్యులను మార్పు చేశారు. ఇలా అనకాపల్లి జిల్లా శ్రీ గౌరి సొసైటీ, మేడివాడ , అదేవిధంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో అనంతగిరి, పాడేరు. జి. మాడుగుల, చింతపల్లి, జి.కే.వీధి సొసైటీ పాలక మండళ్లలో చేర్పులు, మార్పులు చేశారు. అనకాపల్లి జిల్లా తుమ్మపాల సొసైటీకి మాత్రం ముగ్గురు సభ్యులుగా బదులుగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ వీవీవీ సత్యకుమార్‌ను పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు,ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటామని డీసీసీబీ సీఈవో డి.వి.ఎస్. వర్మ తెలిపారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రాజేశ్వరి



హాజరైన విద్యార్థులు



ప్రేరణ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రాజేశ్వరి

నర్సీపట్నం: పదోతరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యార్థులు కష్టపడి చదవాలని జిల్లా బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కె.రాజేశ్వరి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి ప్రేరణ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షలపై భయం పోయేలా ప్రతి హాస్టల్‌లో మనోవిజ్ఞాన వికాసం సదస్సులు నిర్వహించి విద్యార్థులను సంసిద్ధులను చేస్తున్నామన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ప్రేరణ తరగతులను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నిర్వహించే ప్రేరణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో టెన్త్ పరీక్షలకు హాజరవుతున్న 652 మందికి ప్రత్యేక శిక్షణ తరగతుల ద్వారా తర్ఫీదు ఇస్తున్నట్టు చెప్పారు. బాగా వెనకబడిన విద్యార్థులను ఏ,బీ గ్రేడ్‌ల్లోకి తెచ్చేందుకు ఏబీసీడబ్ల్యూవోలు, వార్డెన్‌లు దృష్టిపెట్టాలని ఆదేశించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం, చోడవరం, యలమంచిలి ఏబీసీడబ్ల్యూవోలు నర్సింహులు, చాముండేశ్వరరావు, నాగేశ్వరరావు, జిల్లా హెచ్‌డబ్ల్యూవో యూనియన్ ప్రెసిడెంట్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి విశేష కృషి



పుస్తకావిష్కరణ చేస్తున్న అఖిల భారత వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్ ప్రతినిధి పి.సోమయాజులు, ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వీసీ కట్టమణి, రాజమాత మాయాంక్ కుమారిదేవ్

- వారిది వనవాసీ సంస్కృతి
- కేంద్ర మంత్రి అర్జున్ ముండా
- గిరిజన సాంస్కృతిక యాత్ర ముగింపు సభలో వక్తలు

బీచ్ రోడ్డు(విశాఖ): గిరిజనుల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా తెలిపారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో తూర్పు కనుమలలో గిరిజన సాంస్కృతిక యాత్ర ముగింపు సభను బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వర్చువల్ విధానంలో పాల్గొన్న కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఆదివాసీలది వనవాసీ సంస్కృతి అని, ఇటువంటి యాత్రల ద్వారా అది నేటి తరానికి తెలుస్తుందన్నారు. గిరిజనులు తమ తెగ కట్టుబాట్లకు అధిక ప్రాధాన్యత ఇస్తారన్నారు.

ప్రకృతి ఆరాధకులు

అఖిల భారత వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్ మార్గనిర్దేశకుడు పి.సోమయాజులు మాట్లాడుతూ గిరిజనులు ప్రకృతి ఆరాధకులు, పర్యావరణ పరిరక్షకులన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వీసీ కట్టమణి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో వివిధ భాషల కారణంగా చదవుకు దూరం అవుతున్నారన్నారు. విద్యతోనే దేశ ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం అవుతారన్నారు. జనవరి 25న జైపూర్‌లో ప్రారంభమైన తూర్పు కనుమలలో గిరిజన సంస్కృతిక యాత్ర 20 ప్రాంతాల్లో సభలను నిర్వహించి ఈ నెల 4న విశాఖకు చేరుకుంది. ఈ సందర్భంగా తూర్పు కనుమలలో గిరిజన సంస్కృతిపై రచించిన పుస్తకాన్ని, జైపూర్ రాజమాత మాయాంక్ కుమారి దేవ్, ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్ అధ్యక్షుడు గోపీనాథ్, ఎంపీ జీవీఎల్ నర్సింహారావు, నాగు, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

నాడు కాలినడకన.. నేడు కాన్వాయ్‌తో..



బోడిగరువు, నేరెళ్లపూడికి నూతనంగా నిర్మించిన రోడ్డు మీదుగా కాన్వాయ్‌తో వెళ్లిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడికి కృతజ్ఞతలు తెలుపుతున్న గిరిజన మహిళలు

- బోడిగరువు, నేరెళ్లపూడికి నెల రోజుల్లో మట్టి రోడ్డు
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న డిప్యూటీ సీఎం బూడి
- రెండు గ్రామాల గిరిజనుల ఆనందోత్సాహాలు

దేవరాపల్లి: చింతలపూడి పంచాయతీ శివారులో దట్టమైన అటవీ ప్రాంతంలో కాలిబాట సైతం లేని బోడిగరువు, నేరెళ్లపూడి గిరిజన గ్రామాలకు మహర్దశ పట్టింది. ఇచ్చిన మాట ప్రకారం సువిశాల రోడ్డు నిర్మించి ఆ మార్గం మీదుగా తన వాహన శ్రేణిలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆదివారం పర్యటించారు. సమ్మెద నుంచి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ రెండు గ్రామాలకు కనీసం కాలిబాట సైతం లేక గిరిజనులు రాకపోకలకు నిత్యం నరకయాతన అనుభవించేవారు. వీరి సమస్యలను తెలుసుకునేందుకు ముత్యాలనాయుడు ఇటీవల ఐదు కిలోమీటర్ల మేర కొండలు, గుట్టలు ఎక్కి, గెడ్డలు సైతం దాటి కాలినడకన బోడిగరువు, నేరెళ్లపూడి గ్రామాలలో పర్యటించారు. స్వాతంత్ర్యం వచ్చాక తమ వద్దకు వచ్చిన తొలి ప్రజాప్రతినిధిగా గిరిజనం నీరాజనాలు అందుకున్నారు. రహదారి సౌకర్యం కల్పిస్తానని అప్పుడు ఇచ్చిన మాట ప్రకారం అధికారులతో రోడ్డు నిర్మాణంపై తక్షణం అధ్యయనం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి రూ.2 కోట్లు మంజూరు చేయించారు. కేవలం నెల రోజుల వ్యవధిలోనే రోడ్డును నిర్మించి ఆ రహదారి మీదుగా కార్లలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి బోడిగరువు, నేరెళ్లపూడి గ్రామాలకు చేరుకొని స్థానిక ప్రజలతో మమేకమయ్యారు. ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయిన గిరిజనులు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుకు సంప్రదాయ పద్ధతిలో ఆత్మీయ స్వాగతం పలికారు. ఎన్నో ఏళ్ల నాటి రహదారి సమస్యను పరిష్కరించిన సీఎం జగన్‌కు, డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పరుగు తీస్తున్న అక్షర్ పటేల్, గిల్



గిల్.. థ్రిల్

ఫామ్‌లో లేదన్నారు..విమర్శలు ఎదుర్కొన్నాడు..ట్రాక్ తప్పాడన్నారు.. వీటిన్నింటికీ తన బ్యాట్‌తోనే సమాధానం చెప్పాడు సెన్సేషనల్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్. వైఎస్సార్ స్టేడియంలో తన టెస్ట్ కెరీర్‌లోనే అరుదైన సెంచరీ నమోదు చేశాడు. క్రికెట్ అభిమానులకు థ్రిల్ కలిగించాడు. ఎంతో బాధ్యతాయుతంగా ఆడి జట్టుకు భారీ స్కోర్ సాధించిపెట్టాడు. తన తండ్రి కళ్లముందే ఈ సెంచరీ నమోదు చేయడం వెరీవెరీ స్పెషల్..ఈ మధురానుభూతిని గిల్ తన మదిలో దాచుకున్నాడు. అభిమానులు కేరింతలకు స్టేడియం మార్మోగింది.









పోటెత్తిన ఫ్యాన్స్

విశాఖ స్పోర్ట్స్: మ్యాచ్ ఫార్మాట్ ఏదైనా విశాఖలో జరిగితే.. అది సూపర్‌హిట్టే.! అభిమానుల నుంచి ఆ స్థాయి ఆదరణ ఉంటుంది. భారత్, ఇంగ్లండ్ రెండో మ్యాచ్‌లో భాగంగా ఆదివారం స్టేడియంకు పోటెత్తిన అభిమానులను చూసి బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ సైతం ఆశ్చర్యపోయారు. టెస్ట్‌లకు మళ్లీ పూర్వ వైభవం వస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. భారత ఆటగాళ్లు రాణిస్తుండటం .. పైగా ఆదివారం కావడంతో స్టేడియంలోని ప్రతి స్టాండ్ నిండిపోయింది. త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. జయహో భారత్ నినాదాలతో మార్మోగింది. వన్డేలను కాదని టీ–20లకు ఆదరణ పెరిగిన ఈ తరుణంలో.. ఐదు రోజుల పాటు సాగి.. ఒక్కో సారి ఎటువంటి ఫలితం తేలని టెస్ట్‌ల పట్ల ఆసక్తి తగ్గిపోతుంది. ఈ పరిస్థితుల్లో విశాఖ వేదికగా జరుగుతున్న భారత్–ఇంగ్లండ్ టెస్ట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు ఏకంగా 15 వేల మంది టికెట్లను కొనుగోలు చేసి మరీ వీక్షిస్తున్నారు. ఏసీఏ కేవలం రెండు వేల మంది విద్యార్థులను మాత్రమే స్టేడియంలోకి అనుమతిస్తామని చెప్పినా... విద్యార్థుల తాకిడి పెరగడంతో వారిని నిరాశ పరచకుండా ఆదివారం దాదాపు 7 వేల మందికి ప్రవేశం కల్పించింది. వీరంతా స్టేడియంలోని బీ, సీ, కే స్టాండ్స్‌లో కూర్చొని కేరింతలు కొట్టారు. ఔత్సాహిక క్రికెటర్లను దక్షిణ లోయర్ టైర్ సీ స్టాండ్‌లోకి అనుమతించారు. బాల్ రిట్రీవర్లుగా జోన్ జట్లకు ఆడే ఆటగాళ్లను అనుమతించడం పరిపాటి. అయితే ఆదివారం జరిగిన ఇన్నింగ్స్‌లో జోన్, జోనల్ స్థాయికి ఆడుతున్న అమ్మాయిలను బాల్ రిట్రీవర్లుగా.. ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో అనుమతించారు. ఇది మ్యాచ్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.









క్లుప్తంగా

చిన్నారులిద్దరికీ అండగా నిలుస్తాం



చిన్నారులకు విశాఖ డెయిరీ ఇచ్చిన తక్షణ సాయాన్ని అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ: తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు చిన్నారులకు అండగా నిలుస్తామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఈ సంఘటనపై డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని దిబ్బపాలేనికి చెందిన అరిశంకుల మహాలక్ష్మినాయుడు(40) విశాఖ డెయిరీకి చెందిన దువ్వ బల్క్ మిల్క్ కూలింగ్ సెంటరులో ఆపరేటర్‌గా విధులు నిర్వహించేవారని, గతనెల 28న ఆయన డెయిరీ పనిపై వెళుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్నారు. మూడేళ్ల క్రితం అతని భార్య అనారోగ్యంతో మృతి చెందగా, 8వ తరగతి, 4వ తరగతి చదివే ఇద్దరు మగపిల్లలను మహాలక్ష్మి నాయుడు పోషించుకుంటున్నాడు. మహాలక్ష్మినాయుడు మృతి చెందడంతో ఆచిన్నారుల బాధ్యత వృద్ధుడైన మహాలక్ష్మినాయుడు తండ్రిపై పడిందన్నారు. దీంతో తక్షణ సహకారం కింద చిన్నారులకు రూ.25 వేల నగదును డిప్యూటీ సీఎం చేతుల మీదుగా అందించారు. మరో రూ.25 లక్షలు పిల్లలకు 21 ఏళ్లు నిండిన తరువాత డెయిరీ నుంచి అందించనున్నట్టు తెలిపా రు. శీరంరెడ్డి సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ రమణబాబు, పాలసంఘం అధ్యక్షుడు సన్యాసిరావు, డి.సురవరం సర్పంచ్ అర్జున పాల్గొన్నారు.

కాశీ రైలుకు మరో కోచ్

తాటిచెట్లపాలెం : ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ-బనారస్-విశాఖ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలుకు శాశ్వత ప్రాతిపదికన ఒక ఏసీ పాంట్రీకార్, ఒక ఫస్ట్ ఏసీ కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. విశాఖ-బనారస్(18311) వీక్లీ స్పెషల్‌కు ఈ నెల 14వ తేదీ నుంచి తిరుగు ప్రయాణంలో బయల్దేరే బనారస్ - విశాఖ (18312) వీక్లీ స్పెషల్‌కు ఈ నెల 15వ తేదీ నుంచి ఒక ఏసీ పాంట్రీకార్, ఒక ఫస్ట్ ఏసీ కోచ్‌లను శాశ్వత ప్రాతిపదికన జతచేస్తున్నారు.

అభివృద్ధికి చిరునామాగా
మైదాన, గిరిజన పల్లెలు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- రూ.14.57 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం



సచివాలయ ప్రారంభోత్సవానికి వచ్చిన డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడుకు చింతలపూడిలో కోలాటంతో స్వాగతం పలుకుతున్న మహిళలు



చినసోంపురంలో ఇంటింటా కుళాయిల ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు సంబరంలా జరిగాయి. మండలంలోని రూ.14.57 కోట్ల వ్యయంతో మైదాన, గిరిజన గ్రామాల్లో నిర్మించిన 17 అభివృద్ధి పనులను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పండగ వాతావరణంలో ప్రారంభోత్సవం చేశారు. ప్రారంభోత్సవానికి విచ్చేసిన డిప్యూటీ సీఎంకు గ్రామస్తులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మునుపెన్నడూ లేని విధంగా జరిగిన అభివృద్ధితో మైదాన, గిరిజన పల్లెలు రూపురేఖలు మారి సంక్షేమాభివృద్ధికి చిరునామాగా మారాయని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి మైదాన, గిరిజన పల్లెలకు సైతం రోడ్లు, అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు.

రెండు తారురోడ్లకు ప్రారంభోత్సవం

కొత్తపెంట నుంచి ఎస్.గజపతినగరం వరకు రూ.1.23 కోట్లతో నిర్మించిన తారురోడ్డును, సత్యనారాయణపురం కాలనీ నుంచి చేనుపాలెం వరకు రూ.1.75 కోట్లతో నిర్మించిన తారురోడ్డును డిప్యూటీ సీఎం ప్రారంభించారు. దేవరాపల్లిలో రూ.5.62 కోట్లతో నిర్మించిన ఇంటింటా కుళాయిలను, రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయం-1 భవనం, రూ.20 లక్షలతో కూరాకుల కల్లాలకు, రూ.17 లక్షలతో రెల్లిపేట నుంచి రాయవరపు కల్లాలకు, రూ.11.25 లక్షలతో బండారు వారి కల్లాలకు నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. చింతలపూడి పంచాయతీలో రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, వంతెవానిపాలెం, పెదకోరాడలో రూ.40 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను, చింతలపూడిలో రూ.2.49 కోట్లతో చేపట్టిన ఇంటింటా కుళాయి పనులను ప్రారంభించారు. తామరబ్బ పంచాయతీ పరిధిలోని చినసోంపురంలో రూ.30 లక్షలతో, లోవముకుందపురంలో రూ.30 లక్షలతో, తామరబ్బలో రూ.40లక్షలతో, పాత బొడ్డపాడులో రూ.30 లక్షలతో నిర్మించిన మంచినీటి ట్యాంక్‌లు, ఇంటింటా కుళాయిలను, తామరబ్బలో రూ.20లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను శిలాఫలకాలు ఆవిష్కరించి డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరీ, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శి రొంగలి నారాయణమ్మ, మండల అధ్యక్షుడు బూరె బాబురావు, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరదపురెడ్డి లలితానాయుడు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డా.వి. సింహాచలంనాయుడు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, సర్పంచ్‌లు రొంగలి వెంకటరావు, చిరికి లక్ష్మి, సబ్బవరపు పెంటమ్మ, టోకురి రామకృష్ణ, దొమ్మంగి బోడెమ్మ, ఎంపీటీసీలు మొల్లి కృష్ణమూర్తి, మజ్జి దేవి, బండి గౌరమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అల్లు సూర్యనారాయణ, ఏఈ చంద్రశేఖర్, పీఆర్ ఏఈ ఉమామహేశ్వరరావు, ఎంపీడీవో సిహెచ్.సుబ్బలక్ష్మి, ఇంచార్జ్ ఈవోపీఆర్డి జి. సంతోషి నళిని పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి సీఎం పెద్దపీట

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- ఆర్‌ఆర్‌పేటలో సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్ భవనాలకు ప్రారంభోత్సవం



ఇంటింటి కుళాయిలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్



పేటలో రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న విప్ ధర్మశ్రీ

చోడవరం: రైతులు, ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పెద్దపీట వేశారని, ఆయన పరిపాలన దేశానికే ఆదర్శమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. రాయపురాజు పేట గ్రామంలో నూతనంగా నిర్మించిన హెల్త్‌సెంటర్, సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. అదేవిధంగా జల్‌జీవన్ మిషన్‌లో ఈ గ్రామంలో నిర్మించిన ఇంటింటి కుళాయిలను ధర్మశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అమలు చేయడంతో పాటు గ్రామాల అభివృద్ధి కోసం అన్ని విధాలుగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని అన్నారు. కొత్తగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు అన్ని భవనాలు నిర్మించడం, శాఖలకు అవసరమైన మౌలిక సదుపాయలు కల్పించి, సిబ్బందిని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసి ప్రజలకు సకాలంలో సేవలందించేలా ఆ వ్యవస్థను తీర్చిదిద్దారన్నారు. అభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు పూర్తిగా మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, పీఏసీఎస్ అధ్యక్షుడు సూర్యనారాయణ, మండల అధ్యక్షుడు వెంకట్రావు, సర్పంచ్‌లు భోగేష్, దొడ్డి అప్పారావు, బొడ్డేడ రామునాయుడు పాల్గొన్నారు.

విజయరామరాజుపేటలో...

బుచ్చెయ్యపేట: రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగనన్న పని చేస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. ఆదివారం విజయరామరాజుపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. టీడీపీ ప్రభుత్వంలో రైతులు విత్తనాలు కావాలంటే మండల కేంద్రం చుట్టూ నెలలు తరబడి తిరిగినా దొరికేవి కాదన్నారు. కానీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరవాత సొంత గ్రామంలోనే రైతులకు విత్తనాలు, ఎరువులు అందేలా చేయడమే కాక పండిన పంటను అమ్ముకునేలా రైతు భరోసా కేంద్రాల్ని ఏర్పాటు చేశారన్నారు. వడ్డీ లేని రుణ సదుపాయంతో పాటు పంట పెట్టుబడికి రైతు భరోసా నగదు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దొండా రాంబాబు, సర్పంచ్ విజయ్‌కుమార్, కోఆపరేటివ్ అధ్యక్షుడు గోవింద, ఎంపీటీసీ బాలక్రిష్ణ, వైస్ సర్పంచ్ దొడ్డి జగన్నాథం, నాయకులు వేగి మహాలక్ష్మినాయుడు, గుడాల ఆనంద్, మండల జేఈ ప్రభు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు వడ్డెర కులస్తులు రుణపడి ఉంటారు



ఏసురత్నంను సన్మానిస్తున్న ఉమ్మడి విశాఖ జిల్లా సంఘ సభ్యులు

తుమ్మపాల: సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వడ్డెర కులస్తులు రుణపడి ఉంటారని గుంటూరు ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం అన్నారు. స్థానిక వివేకానంద చారిటబుల్ ట్రస్టు హాల్లో ఉత్తరాంధ్ర వడ్డెర సంఘం గౌరవాధ్యక్షుడు కింతాడ మోహనరావు అధ్యక్షతన ఆదివారం ఉమ్మడి విశాఖ జిల్లా వడ్డెర కుల సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వడ్డెర కులస్తులను బీసీ-బీ నుంచి బీసీ -ఏకు మార్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. వెనుకబడిన కులస్తులను ముందంజలో చేర్చి అన్ని సంక్షేమ పథకాలు అందిస్తూ భరోసా కల్పించారని చెప్పారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కుల, మత భేదం లేకుండా రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని దగ్గర చేస్తూ వచ్చారని జగన్‌ను కొనియాడారు. రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యపడుతుందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చి గ్రామస్వరాజ్యం స్థాపించారన్నారు. పేదోడి సొంతింటి కల నెరవేరుస్తూ స్థలాల పంపిణీతో జగనన్న ఊళ్లుగా మారాయని చెప్పారు. ఉత్తరాంధ్రలో వడ్డెర కుల సంక్షేమ సంఘానికి సామాజిక భవనం మంజూరు చేయాలని ఉమ్మడి విశాఖ జిల్లా సంఘ సభ్యులు కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ సుపరిపాలనను పేదలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దగ్గర చేస్తూ వచ్చారన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అంతకు ముందు ఏసురత్నంను ఉమ్మడి విశాఖ జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం సభ్యులు దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జామి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కండిపల్లి నాగభూషణం, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కింతాడ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి దిమిలి సన్ని, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ముడిదాని ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి ముడిదాని ఆనంద్, సభ్యులు కుంచాల వీరయ్య, మూడు జిల్లాల సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో హాస్టల్ విద్యార్థి మృతి

- జోగుంపేట ఎస్సీ వసతిగృహంలో దుర్ఘటన
- తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు



మృతుడు దావీద్‌రాజు



ఏరియా ఆస్పత్రి వద్ద ఆవేదన చెందుతున్న కుటుంబ సభ్యులు



హాస్టల్ మేడ పైకి వెళ్లకుండా మెట్లపై వేసిన ముళ్ల కంచె

గొలుగొండ: ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ తగిలి హాస్టల్ విద్యార్థి మృతి చెందాడు. జోగుంపేట ఎస్సీ వసతి గృహంలో 7వ తరగతి చదువుతున్న తూబిరి దావీద్‌రాజ్(14) ఆదివారం సాయంత్రం బట్టలు ఆరబెట్టడం కోసం వసతి గృహం మేడపైకి వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. జోగుంపేట ఎస్సీ వసతి గృహంలో గొలుగొండ మండలం బుడ్డడపాడుకు చెందిన తూబిరి దావీద్‌రాజు 7వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం కావడంతో బట్టలు ఉతికి వాటిని మేడపైకి వెళ్లాడు. మేడపై చెట్లు ఉండటం, ఈ చెట్టుకు విద్యుత్ వైర్లు ఆనుకొని ఉండడం వల్ల ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ తగిలింది. ప్రమాదానికి గురైన విద్యార్థిని తోటి విద్యార్థుల సహాయంతో వెంటే గొలుగొండ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ప్రమాదం పొంచి ఉన్నా...

ఈ వసతిగృహం చుట్టూ చెట్లు ఉన్నాయి. వాటి మధ్య నుంచి విద్యుత్ వైర్లు వెళుతున్నాయి. ఇవి ప్రమాదకర స్థితిలో ఉండడంతో పలుమార్లు వసతి గృహం యాజమాన్యం విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా విద్యార్థులెవరూ మేడపైకి వెళ్లకుండా మెట్ల వద్ద ముళ్ల కంచె ఉంచారు. అయితే ఆదివారం దావీద్‌రాజ్ వసతి గృహానికి ఆనుకుని ఉన్న మామిడిచెట్టు ఎక్కిపైకి వెళ్లడంతో విద్యుత్‌వైర్లు తగిలి షాక్‌కు గురయ్యాడు. బుడ్డడపాడు ఎస్టీ కులానికి చెందిన దావీద్‌రాజు తల్లిదండ్రులు బాలరాజు, రమణమ్మ గ్రామంలో కూలిపని చేసుకుని జీవిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు కాగా, చిన్న కుమారుడైన దావీదురాజు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. గొలుగొండ ఎస్‌ఐ బి.కృష్ణారావు ఏరియా ఆస్పత్రి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఆస్పత్రి వద్ద ఆందోళన

నర్సీపట్నం: విద్యార్థి చావుకు కారణమైన వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేసి, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలంటూ గ్రామస్తులు, ప్రజాసంఘాల నాయకులు ఏరియా ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు ధర్మరాజు, బీఎస్పీ నాయకులు బి.నాగరాజు, చింతపల్లి ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు సత్యనారాయణ, వామపక్ష ఎ.రాజు, ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి ప్రమాదానికి గురైతే కనీసం తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా అనాథ శవంలా మార్చురీలో పడేయడం దారుణమన్నారు. హాస్టల్ భవనానికి విద్యుత్ సరఫరా అవుతున్నా వార్డెన్ పట్టించుకోకపోవడం వల్లే ఈ అనర్థం జరిగిందన్నారు. వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ డివిజన్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు చిట్ల చలపతిరావు ఆస్పత్రికి చేరుకున్నారు.

అంతలోనే మాయమైపోయావా...

మార్చురీలోని కొడుకు శవాన్ని చూసిన తల్లిదండ్రులు బాలరాజు, రమణమ్మ గుండెలు బాదుకుంటూ విలపించారు. బాబూ నేను చూసేందుకు వచ్చిన కొన్ని గంటల్లోనే మాయమైపోయావా.. నేను తెచ్చిన పప్పులు తిన్నావా బాబు..అంటూ తల్లి రమణమ్మ రోదిస్తుంటే అక్కడకు వచ్చిన గ్రామస్తులు సైతం కన్నీళ్లు పెట్టుకున్నారు.

కుటుంబాన్ని ఆదుకోవాలి...

జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ అజయ్‌బాబు ఏరియా ఆస్పత్రికి చేరుకుని ఆందళనకారులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. ఘటనపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో చెపాల్సని ఆయనను ఆందోళనకారులు నిలదీశారు. ఆర్డీవో వి.జయరాం ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి ఉద్యోగం, భూమి ఇప్పించాలని డిమాండ్ చేయడంతో కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని ఆయన వారికి హామీ ఇచ్చారు.



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

విశాఖలో 'భామా కలాపం-2' సందడి

డాబాగార్డెన్స్: విశాఖ నగరంలో భామా కలాపం-2 చిత్ర బృందం ఆదివారం సందడి చేసింది. హీరోయిన్ ప్రియమణి ప్రధాన పాత్ర పోషించిన 'భామాకలాపం' రెండేళ్ల కిందట వచ్చి, మంచి ఆదరణ పొందింది. ఓటీటీలో స్ట్రీమింగ్ అయిన ఆ చిత్రం విజయం సాధించగా.. ఇప్పుడు భామాకలాపం -2 సీక్వెల్ విడుదలకు సిద్ధమైంది. ఈ నెల 16 నుంచి ఓటీటీలో అలరించనుందని చిత్ర బృందం తెలిపింది. మూవీ ప్రమోషన్లో భాగంగా చిత్ర యూనిట్ విశాఖ వచ్చింది. ఈ సందర్భంగా చిత్రంలో ప్రధాన పాత్రల్లో నటించిన శరణ్య, శీరత్ కపూర్ మాట్లాడుతూ భామాకలాపం సీజన్-1 లాగే, సీజన్-2 కూడా ప్రేక్షకులను అలరిస్తుందని చెప్పారు. చిత్రానికి అభిమన్యు దర్శకత్వం వహించారని, బాపినీడు, సుధీర్ నిర్మించగా, ప్రశాంత్ ఆర్.విహారీ సింగీతం అందించారన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి..



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలతో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

చీడికాడ: మండలంలోని జైతవరానికి చెందిన పది టీడీపీ కుంటుంబాలకు చెందిన పెద్దలు ఆదివారం డిప్యూటీ సీఎం బూడి సమక్షంలో ఉపసర్పంచ్ ఈర్లె చైతన్య ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి డిప్యూటీ సీఎం పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీపై, నాయకత్వంపై నిబద్ధతతో ఉండే ప్రతి కార్యకర్తకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని చెప్పారు. పార్టీలో చేరిన నాయకులు బొడ్డకాయలు చినబాబు, గనివాడ వాసు, గనివాడ కిరణ్, బొడ్డు దేవుడు, డొకల శ్రీరామమూర్తి, బొడ్డు గోవింద, బొడ్డ కాయల అప్పలనాయుడు, బొడ్డకాయల అప్పారావు, గనివాడ సన్నిబాబు, డోకల నూకరాజు, గొర్లి ఈశ్వరరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, డిప్యూటీ సీఎం బూడి నాయకత్వంపై తమకు ఎనలేని నమ్మకం ఉందన్నారు. వారి ఆదేశాల మేరకు గ్రామంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఈర్లె చైతన్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదా జానకిరాం పాల్గొన్నారు.

జనసేన నుంచి..

మాడుగుల: మండలంలోని వొమ్మలి గ్రామంలో జనసేన పార్టీ నుంచి మూడు కుటుంబాలు వారు వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామానికి చెందిన తాటికొండ నాగభూషణ్, వెలమ చెట్టి కృష్ణ, గొర్లి సన్నిబాబు కుటుంబాలు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బొడ్డపు భాస్కరరావు ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి పనిచేసిన ప్రతి కార్యకర్తకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల యూత్ కార్యదర్శి పక్రే ఏసుబాబు, గ్రామ కమిటీ కన్వీనర్ పూసర్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మశ్రీ సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి..

చోడవరం: తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు మహిళా కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. చోడవరం మండలం అడ్డూరు పంచాయతీ శివారు కృష్ణాపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీకి చెందిన మహిళా ప్రతినిధులు బూరా పార్వతి, బూరా ఈశ్వరమ్మ, బూరా చెల్లయ్యమ్మ, యలమంచిలి దేముడమ్మ, నమ్మి ఈశ్వరమ్మతోపాటు 10కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంక్షేమానికి చేస్తున్న కృషికి తామంతా మద్దతు తెలుపుతూ వైఎస్సార్‌సీపీలో చేరామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



జన సేన నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన మహిళలను ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



నాటి ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థినులు

రావికమతం: వారంతా పలు రంగాల్లో ప్రభుత్వ ఉద్యోగాల్లో, వ్యాపారాల్లో ఎక్కడెక్కడో పనిచేస్తున్నారు. వారంతా తాము చిన్నపుడు చదువుకున్న స్కూల్‌కు ఆదివారం భారీగా తరలివచ్చారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆనాటి గురువులను సైతం తీసుకువచ్చి సన్మానించి వారి ఆశీస్సులు పొందారు. వారంతా కొత్తకోట హైస్కూల్లో 2001లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు. ఆ గ్రామానికి చెందిన ఇర్ల శ్రీను, గట్టా శివ తదితర 184 మంది వరకూ కొత్తకోట హైస్కూల్లో నాడు చదువుకున్నారు. ఆదివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. 181 మంది పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఇంతలా అంత ఎక్కువ మంది హాజరు కావడం విశేషంగా అందరూ భావించారు. ఆనాటి తమ గురువులను సన్మానించి ఆశీస్సులు పొందారు. సహపంక్తి భోజనాలు చేశారు. మిత్రుల కష్ట సుఖాల్లో సమాచారం అందించుకోవాలని నిర్ణయించుకున్నారు.



కొత్తకోట హైస్కూల్లో ఆదివారం కలుసుకున్న 2001బ్యాచ్ విద్యార్థులు

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

■ 2 BHK Flat, 1010 Sqft, MVV Highway Homes, NH 16, Madhurawada For Sale. Contact: 8826452478. [WB-48037]

PLOT FOR SALE

■ GVMC 77 వార్డులో 6 లక్షలకే 111 చ॥గ॥, 150 ప్లాట్స్ గలవు. దగ్గరలో బస్సులు, ఇల్లు అన్ని సౌకర్యాలతో అందుబాటులో EMI కలదు. ఫోన్ : 73864 14017 [V- 796975]

Services

BUSINESS OFFER

■ చెరకు రసం మెషిన్ల వ్యాపారం కొరకు 1,50,000/- పెట్టుబడి కావలెను. పెట్టుబడిపై వడ్డీగాని లేక లాభంలో 50-50గా గాని ఇవ్వబడును. ఫోన్ : 95819 83210 [V- 2359]

■ Sri Avani Eco-Life Pvt Ltd. తక్కువ పెట్టుబడితో వ్యాపారాన్ని ప్రారంభించండి. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా "బయోడిగ్రేడబుల్" కవర్లను మార్కెటింగ్ చేయుటకు మండలాల వారీగా డీలర్లు కావలెను. ఫోన్: 9493786468, 6301041696. [H-801665]

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1261198]

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 11574]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

Wanted

■ NET / XEROX Operator. Part / Full Time. Attractive Salary. Sai Net, Shop No.46, RTC Complex, Dwarakanagar, VSP-16. Ph : 95536 77279, 90009 20204 [V- 2379]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233774]

■ సేల్స్ ప్రమోటర్స్ (స్త్రీ/పు) జీతం : 15వేలు + ఇన్సెంటివ్స్, వయస్సు : 18+ అర్హత : ఇంటర్ + హెల్పర్స్ : (స్త్రీ/పు) కావలెను. జీతం : 10వేలు. వయస్సు : 18+, అర్హత : 10పాస్. సాయి మొబైల్ సెంటర్, డాబాగార్డెన్స్, వైజాగ్. ఫోన్ : 70134 33911 [V-786709]

■ మీరు ఉన్న చోటు నుండి డిజిటల్‌గా వర్క్ చేస్తూ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో అధిక ఆదాయం సంపాదించవచ్చు. (పార్ట్ / ఫుల్ టైం) 100% ఎటువంటి ఫీజులు ఉండవు. సంప్ర : 97015 05819 [V-797167]

■ హైదరాబాదులోని ఆప్తా హోం కేర్‌లో వృద్ధులను చూసుకోవడానికి 21-45వయస్సు గల M/F కేర్‌టేకర్స్ కావలెను. జీతం: 16-20వేలు, భోజనం, వసతి, ఇన్సూరెన్స్ కలవు. Cont: 9381848549 [G-1652]

■ ప్రముఖ ఎయిర్‌పోర్ట్‌లో పనిచేయుటకు లోడింగ్ సూ"పైజర్స్, హౌస్ కీపింగ్ సూ"పైజర్స్, డ్రైవర్స్, కార్గో లోడర్స్,కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. జీతం: 25000/- 35000/- రూం+భోజనం ఫ్రీ. ఫోన్: 7093769794. [H-788064]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 18K. ఫోన్: 9160900024/9640400073. [HA-1168]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	:9010546644
యలమంచిలి	:9951602901
చోడవరం	:9010210265
నర్సీపట్నం	:9010234557
పాడేరు	:9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

క్లుప్తంగా

శిథిల భవనాల తొలగింపు



భవనాలను నేలమట్టం చేస్తున్న దృశ్యం

తుమ్మపాల : మండలంలో ఊడేరు గ్రామంలో శిథిలావస్థలో ఉన్న పంచాయతీ భవనంతో పాటు సామాజిక భవనాలను ముందస్తు చర్యల్లో భాగంగా ఆదివారం పంచాయతీ సిబ్బంది జేసీబీ సహాయంతో తొలగించారు. శిథిలమైన ఈ రెండు భవనాలు నేలమట్టం కావడంతో ఆ చోటులో పలు శుభకార్యాలు చేసుకునే అవకాశం ఏర్పడిందని సర్పంచ్ శిరిగిరిశెట్టి కృష్ణమోహన్, వైస్ సర్పంచ్ బొబ్బిలి రాజు, స్థానికులు తెలిపారు.

మహా సాధన సంకల్ప సభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పెంటయ్యనాయుడు తదితరులు

తుమ్మపాల : మహా సాధన సంకల్ప సభను దళితలందరూ విజయవంతం చేయాలని తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు అన్నారు. మండలంలో తుమ్మపాల అంబేడ్కర్ కాలనీలో ఆదివారం సభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈనెల 10న పాయకరావుపేటలో మహా సాధన సంకల్ప సభ జరగనుందన్నారు. వెయ్యి జనాభా కలిగిన ప్రతి దళిత వాడ ప్రత్యేక పంచాయతీ కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రత్యేక పంచాయతీకి సమకూరే నిధులతో దళితవాడలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ మెంబర్ రేబాక మధుబాబు, ఎంపీటీసీ వడ్డాది భారతి, అంబేడ్కర్ ఇండియన్ మిషన్ జోనల్ నాయకులు మామిడి శ్రీనివాసరావు, బల్లి రాజశేఖర్, రెళ్ల నారాయణరావు, వడ్డాది అశోక్ పాల్గొన్నారు.

'సుపరిపాలన అందిస్తున్న ప్రధాని మోదీ'

తుమ్మపాల : దేశంలో సుపరిపాలన అందిస్తున్న బీజేపీ ప్రభుత్వం ఏపీలో కూడా అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ పాలనను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ సూచనల మేరకు పల్లెకు పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పల్లెవాసులకు కూడా మోదీ పాలన గురించి వివరించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ద్వారపూడి పరమేశ్వరరావు, రాష్ట్ర నాయకులు డాక్టర్ సత్యనారాయణ, పొన్నగంటి అప్పారావు, పార్లమెంట్ కన్వీనర్ వర్మ, ప్రధాన కార్యదర్శి పట్టాభి ప్రసాద్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

గుంటూరు కారం	: రాజా
అంబాజీపేట	
మ్యారేజిబ్యాండు	: సత్యనారాయణస్కీన్-1
బూట్‌కట్ బాలరాజు	: సత్యనారాయణస్క్రీన్-2
నా సామిరంగ	: షిర్డిసాయి
ధీర	: పర్తిసాయి
కిస్మత్	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 64 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, బీ పాజిటివ్-13 యూనిట్లు, ఓ పాజిటివ్-35 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు, ఎ నెగెటివ్-1 యూనిట్, ఓ నెగెటివ్-1 యూనిట్, ఏబీ నెగెటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 213 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 316 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

వైద్య సేవల్లో వెరీవెల్

పూర్వ భారతీయ వైద్యం అయిన ఆయుర్వేదానికి ఆయుష్మాన్ భారత్ పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం అందిస్తున్నాయి. దీనిలో భాగంగా రూ.5 లక్షలు సమకూర్చి డిస్పెన్సరీని వెల్‌నెస్ సెంటర్‌గా మార్పు చేసి భవనాన్ని ఆధునికీకరించారు. మండలంలోని కన్నూరుపాలెంలో ఉన్న ఆయుష్మాన్ ఆయుర్వేదిక్ వెల్‌నెస్ కేంద్రంలో వైద్య పరికరాలు, అన్ని రకాల వ్యాధులకు మందులు సమకూర్చారు. ఇప్పుడు చుట్టుపక్కల వారు ఇక్కడ సేవలు పొందుతున్నారు.

ఆయుర్వేదిక్ వెల్‌నెస్ సెంటర్‌కు పెరుగుతున్న ఆదరణ

వైద్యం, మందుల పట్ల ఆసక్తి చూపుతున్న స్థానికులు



మోకాళ్ల నొప్పుల చికిత్సకు ఉపకరించే ఇన్‌ఫ్రారెడ్ మెషీన్

కోటకోట : సుమారు నాలుగు దశాబ్దాల క్రితం మారుమూల ప్రాంతమైన కన్నూరుపాలెంలో ప్రభుత్వం ఆయుర్వేదిక్ డిస్పెన్సరీని ఏర్పాటు చేసింది. అయితే ఈ వైద్యం పట్ల అవగాహన లేక ప్రజలు పెద్దగా ఈ సేవలు ఉపయోగించుకునే వారు కాదు. వైద్యులు, సిబ్బంది కూడా అరకొరగానే ఉండేవారు. దీనికి నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరడంతో 2016లో రూ.7 లక్షలతో కొత్తగా భవనాన్ని నిర్మించారు. దానిలో సరైన సదుపాయాలు లేక సేవలు కూడా అంతంత మాత్రంగానే ఉండేవి. ఈ నేపథ్యంలో **ఆయుష్మాన్ భారత్ పేరిట వీటిని పటిష్టం చేసి భారతీయ వైద్యమైన ఆయుర్వేదం** పట్ల ప్రజలకు విస్తృతంగా అవగాహన కలిగించి సేవలందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.5 లక్షలు సమకూర్చి డిస్పెన్సరీని వెల్‌నెస్ సెంటర్‌గా మార్పు చేసి నూతన హంగులతో ఇటీవల భవనాన్ని ఆధునికీకరించారు. ఆయుర్వేదిక్ ఫార్మసీ రాష్ట్ర విభజనతో తెలంగాణకు వెళ్లిపోవడం వల్ల కేరళ ఔషధాలయంతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుని అక్కడి నుంచి ఆయుర్వేదిక్ మందులు, తైలాలు వగైరా కొనుగోలు చేస్తోంది. అవి ఇక్కడి వెల్‌నెస్ కేంద్రానికి కూడా చేరాయి. దాదాపు అన్ని రకాల వ్యాధులకు సరిపడిన మందులు అందుబాటులోకి వచ్చాయి. ప్రధానంగా



ఎత్తు కొలిచే హైట్ డిజిటల్ మీటర్

గర్భస్థ వ్యాధులు, నరాల బలహీనత, వ్యాధి నిరోధక శక్తి పెంచడానికి, ఎసిడిటీ, అజీర్ణ సమస్యలు,



వెల్‌నెస్ సెంటర్ ఆవరణలో ఔషధ మొక్కల పెంపకం

సీజనల్ వ్యాధులు తదితర వాటికి మందులు అందుబాటులో ఉన్నాయి.

వైద్యాధికారి ఆయుర్వేదిక్ వైద్యం పట్ల అపోహలు **పోగొట్టి అవగాహన కలిగిస్తూ స్కూళ్లలో** విద్యార్థులు, గ్రామాల్లో ప్రజల కోసం శిబిరాలు నిర్వహించి ఉచిత మందులు అందజేస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో కూడా ప్రత్యేకంగా ఆయుర్వేదిక్ శిబిరాలను నిర్వహించారు. మండల గ్రామాల్లోనే కాకుండా నర్సీపట్నం ప్రాంతంలో కూడా ఈ కేంద్రం ద్వారా అవసరమైనప్పుడు శిబిరాలు నిర్వహించి సేవలను విస్తృతంగా అందిస్తున్నారు. ప్రస్తుతం సెంటర్‌కు రోగులు కూడా బాగానే వచ్చి సేవలు పొందుతున్నారు. అలాగే యోగా, ధ్యానం పట్ల అవగాహన కలిగిస్తూ శిక్షణ ఇవ్వడానికి ఇద్దరు యోగా టీచర్లను కూడా నియమించారు. వారు స్కూళ్లలో విద్యార్థులు, స్థానికంగా ప్రజలకు శిక్షణ ఇస్తున్నారు.

అందుబాటులో పరికరాలు..

మోకాళ్ల నొప్పుల నివారణకు చికిత్స కోసం ఇన్‌ఫ్రారెడ్ మెషీన్, పల్స్ తనిఖీకి పల్స్ ఆక్సీ మీటర్, జ్వరం తీవ్రత తెలుసుకోవడానికి థర్మా మీటర్, మనిషి ఎత్తు కొలవడానికి హైట్ డిజిటల్ మీటర్, నీటిని శుభ్రపరిచే వాటర్ ప్యూరిఫికేషన్ యంత్రం తదితర పరికరాలను సమకూర్చారు. త్వరలో దీన్ని ఆయుష్మాన్ భారత్ తరఫున సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా రూపొందించడానికి, పంచకర్మల చికిత్స అందుబాటులో తేవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందుకు అవసరమైన గదులు అందుబాటులో ఉన్నాయి. ఇవి అందుబాటులోకి వస్తే దీని సేవలు మరింత విస్తరించనున్నాయి. వెల్‌నెస్ సెంటర్‌ను అభివృద్ధి చేయడంతో పాటు సేవలు మెరుగుపర్చడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఆధునికీకరించిన కన్నూరుపాలెం ఆయుర్వేదిక్ వెల్‌నెస్ సెంటర్



కన్నూరుపాలెం హైస్కూల్లో విద్యార్థులకు ఉచితంగా అందజేసిన ఆయుర్వేదిక్ మందులు

సేవలు బాగున్నాయి..



వెల్‌నెస్ సెంటర్‌లో వైద్య సేవలు సౌకర్యవంతంగా ఉన్నాయి. షుగర్ వ్యాధితో చాలా కాలంగా బాధపడుతున్నాను. ఆయుర్వేదిక్ వైద్యం గురించి తెలుసుకుని వెల్‌నెస్ సెంటర్‌లో సంప్రదించి వైద్యుల సూచన మేరకు మందులు వాడిన తర్వాత షుగర్ సాధారణ స్థాయికి వచ్చింది. ఇతర అనారోగ్య సమస్యలు తగ్గి ఆరోగ్యం కుదుట పడింది. ఎంతో ఆనందంగా ఉంది.

– ఎం.కనకరత్నం, కన్నూరుపాలెం.

రోగుల సంఖ్య పెరిగింది..



కన్నూరుపాలెం ఆయుష్మాన్ భారత్ ఆయుర్వేదిక్ వెల్‌నెస్ సెంటర్‌ను రూ.5 లక్షలతో ఆధునికీకరించాం. దీనిలో సుమారు మూడున్నర లక్షల ఖర్చుతో భవనాన్ని అందంగా తీర్చిదిద్దాం. మిగిలిన నిధులను వైద్య పరికరాలు, మందులకు కేటాయించాం. ప్రజలకు అవగాహన కోసం ఔషధ మొక్కల ప్లాంట్ పెంపకం చేపట్టాం. ఇద్దరు ఉపాధ్యాయులతో యోగా, ధ్యానంపై అవగాహన కల్పిస్తున్నాం. మండలంలోని పలు గ్రామాలతో పాటు నర్సీపట్నంలో కూడా అవసరమైనప్పుడు శిబిరాలు నిర్వహించి సేవలందిస్తున్నాం. వెల్‌నెస్ సెంటర్‌కు రోగుల సంఖ్య కూడా పెరిగింది.

– కె. లావణ్య, ఇన్‌చార్జి వైద్యాధికారి, ఆయుర్వేదిక్ వెల్‌నెస్ సెంటర్, కన్నూరుపాలెం.

ఐక్యతతోనే అభివృద్ధి



దంపతులను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

అనకాపల్లి : చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘ సభ్యులందరూ ఐక్యంగా మెలగాలని జిల్లా సంఘం అధ్యక్షుడు ఉప్పు సత్యనారాయణ అన్నారు. మండలంలో సత్యనారాయణపురం సత్యదేవుని కొండ వద్ద ఆదివారం సంఘ కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయికలో ఆయన మాట్లాడారు. పోరాటాల ద్వారానే బీసీలు రాయితీలు పొందవచ్చన్నారు. అంతకు ముందు 50 ఏళ్ల వివాహ వార్షికోత్సవం జరుపుకున్న మావూరి వీరభద్రరావు, బాసిన గురుమూర్తి, రెడ్డి అప్పారావు జంటలను ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం 200 మంది కుటుంబాలకు చెందిన వారు ఆహ్లాదకరమైన వాతావరణంలో భోజనాలు చేశారు. సంఘం గౌరవాధ్యక్షుడు ముప్పన సుబ్రహ్మణ్యం, కార్యదర్శి కాలెపు సదాశివరావు, స్థానిక సంఘం అధ్యక్షుడు ఉజ్జి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ముప్పన లింగేశ్వరరావు, కార్యదర్శి బల్లా నాగభూషణం, కోశాధికారి ముప్పన నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ పథకం సాధనకు పోస్టుకార్డ్ ఉద్యమం



పోస్టర్ విడుదల చేస్తున్న చినబ్బాయ్, యూటీఎఫ్ నేతలు

తుమ్మపాల : పాత పెన్షన్ పథకం సాధన కోసం పోస్టుకార్డ్ ఉద్యమం తలపెట్టినట్లు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ అన్నారు. కార్యాలయంలో ఆదివారం ఉద్యమ పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. ఈనెల 6 నుంచి 12వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 13 నుంచి 29 వరకు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సీపీఎస్/జీపీఎస్ విధానాలు రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతు ఉద్యమం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు గాయత్రి, కోశాధికారి జోగా రమేష్, కార్యదర్శులు నడిగట్ల శేషుకుమార్, చైతన్య, రాష్ట్ర కౌన్సిలర్లు ఎల్లయ్యబాబు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పడమటమ్మ తీర్థ మహోత్సవం



ఆభరణాలు, కరెన్సీ నోట్లతో అలంకరించిన పడమటమ్మ అమ్మవారు



ఎడ్ల పరుగు పోటీలు

కోటకోట : పడమటమ్మ తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక కస్పావీధి ప్రాంతంలోని పొలాల్లో వెలసిన ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని అభరణాలు, నూతన వస్త్రాలు, కరెన్సీ నోట్ల మాల, పూలదండలతో అందంగా అలంకరించారు. ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారిని కోటకోట గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి ఎక్కువ మంది భక్తులు తరలి వచ్చి దర్శించుకున్నారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవిందసత్యనారాయణ, వంగలపూడి అనిత తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు దుశ్శాలువ కప్పి జ్ఞాపికలతో సత్కరించారు. తీర్థం సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం తీర్థ మహోత్సవం జరిగింది. తిను బండారాలు, ఆట వస్తువులు, పండ్లు తదితర విక్రయాలు జోరుగా సాగాయి. బాలికలు కోలాటాలు నిర్వహించారు. రాత్రి డ్యాన్స్ మస్తీ వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు గొంతిన గోపి, దాసరి బాబు తదితరుల ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహించారు.

ఉత్సాహభరితంగా ఎడ్ల బళ్ల పోటీలు..

తీర్థం సందర్భంగా ఉత్సాహభరితంగా జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు జరిగాయి. పోటీలో విజేత ఎడ్లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థి బహుమతులు అందజేశారు. సుమారు 16 బళ్లు పోటీలో పాల్గొన్నాయి. కోటకోటతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు ఉత్సాహంగా హాజరై ఆసక్తిగా తిలకించారు.

మహా కుంభాభిషేకం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న క్షేత్రం నిర్వాహకులు

తుమ్మపాల : గ్రేటర్ విశాఖ విలీన గ్రామమైన సిరసపల్లి చింతామణి దత్త క్షేత్రంలో ఈనెల 9న జరిగే మహాకుంభాభిషేకం పోస్టర్‌ను క్షేత్రం నిర్వాహకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ప్రజలందరూ హాజరు పాల్గొనాలని కోరారు.

నోబుల్ సంస్థ సేవలు అమోఘం



నూకరాజును సత్కరిస్తున్న అతిథులు

తుమ్మపాల : నోబుల్ సంస్థ సేవలు అమోఘమని డాక్టర్ కె.విష్ణుమూర్తి అన్నారు. స్థానిక బీసీ వసతి గృహంలో నోబుల్ చారిటీస్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు జయలక్ష్మి, వ్యవస్థాపక కార్యదర్శి ఎస్. నూకరాజు కుమార్తె రత్నావళి జయంతి వేడుకలు జరిగాయి. సంస్థ సహకారంతో ఆయన వసతి గృహ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ సేవలు మరువరానివి అన్నారు. 20 సంవత్సరాల నుంచి మహిళలకు, యువతకు సంస్థ అందిస్తున్న సేవలను వివరించారు. వసతి గృహ ఆయాలకు నూతన వస్త్రాలు అందజేశారు. ఏఎంఏఎల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన నూకరాజును ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, దిశ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ శిరీష, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా సభ నేడు

తుమ్మపాల : మండలంలో మార్టూరు గ్రామంలో సోమవారం వైఎస్సార్ ఆసరా సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ హాజరవుతారని, పార్టీ నేతలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, గృహ సారథులు హాజరు కావాలని ఆయన కోరారు.

విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలి



మాట్లాడుతున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్



హాజరైన స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు

కోటకోట : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గురించి విస్తృతంగా ప్రచారం చేసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయదుందుభి మోగించడానికి దోహదపడాలని పార్టీ నియోజక వర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ కోరారు. కోటకోటలోని శారదానది అవతల ప్రైవేటు అతిథి గృహంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో ఆదివారం మండల స్థాయి పార్టీ శ్రేణులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో సమావేశం నిర్వహించి వారితో మమేకమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నవ రత్నాలు, ఇతర సంక్షేమ పథకాలతో పాటు గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, సామాజిక భవనాలు నిర్మించి అభివృద్ధి చేశారన్నారు. ఈ పథకాల గురించి గ్రామాల్లో పర్యటించి ప్రజలకు వివరించాలన్నారు. వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రతి కార్యకర్త, స్థానిక ప్రజా ప్రతినిధులు కష్టపడి పని చేసి పార్టీని విజయపథంలో నడిపించాలని కోరారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్‌ను సత్కరించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులను కలిసి పరిచయం చేసుకున్నారు. సమావేశానికి ముందు స్థానిక గవరపేటలోని దుర్గమాంబను దర్శించుకుని భరత్‌కుమార్ పూజలు చేశారు. అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండల సచివాలయ కమిటీ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, యువజన విభాగం నాయకులు జాజుల రమేష్, మలసాల కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద మహిళలకు కుట్టుమిషన్ల అందజేత



మహిళలకు కుట్టుమిషన్లు అందిస్తున్న సుధీర్, సభ్యులు

తుమ్మపాల : స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఆదివారం క్లబ్ రీజనల్ చైర్మన్ సుధీర్ నిరుపేద మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేసేందుకు 11 క్లబ్‌లు ఏకమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వెంకటరాజు, కార్యదర్శి రాజేష్, కోశాధికారి రత్నాజీ, క్లబ్ సభ్యులు బాదం బాలకృష్ణ, నూకరాజు, అప్పలరాజు, శంకరరావు, వేణు, సత్యనారాయణ పాల్గొన్నారు.

సందడి చేసిన పూర్వ విద్యార్థులు



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అనకాపల్లి : ఆప్యాయత నిండిన కబుర్లకు స్థానిక జార్జి క్లబ్ వేదికగా మారింది. గవరపాలెం జీవీఎంసీ హైస్కూల్ 1968-69 పూర్వ విద్యార్థుల కలయిక క్లబ్ ఆవరణలో ఆదివారం జరిగింది. నాటి విద్యార్థులంతా పిల్లల్లా ఉత్సాహంగా గడిపారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ముచ్చట్లాడుకున్నారు. ఆరోగ్యం ఎలా ఉంది.. పిల్లలు ఏం చేస్తున్నారంటూ సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా గౌరీ సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ, హైదరాబాద్, విశాఖపట్నం నుంచి 36 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి



రోగులకు అవగాహన కల్పిస్తున్న వైద్యుడు నాయుడు

అనకాపల్లి : క్యాన్సర్ మహమ్మారి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు డీడీ నాయుడు అన్నారు. స్థానిక నర్సింగ్‌హోమ్‌లో ఆదివారం క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ డేను పురస్కరించుకుని వ్యాధి నివారణపై రోగులకు అవగాహన అవగాహన కల్పించారు. వ్యాధిని తొలిదశలో గుర్తించి వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఇటీవల కాలంలో పెద్ద సంఖ్యలో క్యాన్సర్ మరణాలు నమోదవుతున్నాయన్నారు. క్లబ్ అధ్యక్షుడు భీశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ ఈ వ్యాధి నివారణకు క్లబ్ సభ్యులందరూ కలిసికట్టుగా రావాలని ఆయన పిలుపునిచ్చారు. స్త్రీలు గర్భాశయ, బ్రెస్ట్ క్యాన్సర్లకు లోనవుతున్నారన్నారు. వ్యాధి గ్రస్తులను గుర్తించడంతో పాటు వారికి అగనంపూడి హోమీ బాబా, విశాఖ మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రులకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి రాపేటి నారాయణరావు, క్లబ్ సభ్యులు నల్లల దేవుళ్లు పాల్గొన్నారు.

బాలికల హైస్కూల్లో చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవం



మొక్కలు నాటుతున్న గ్రీన్ క్లబ్ సభ్యులు

కోటకోట : స్థానిక బాలికల హైస్కూల్లో గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సుమారు 35 మొక్కలు నాటారు. హెచ్‌ఎం ఎం.ఎస్. స్వర్ణకుమారి, వృక్ష మిత్ర అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, జిల్లా సైన్స్ అధికారి దాడి కాళిదాసు, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త కొండలరావు, క్లబ్ ప్రతినిధులు సత్యనారాయణ, మళ్ల మురళి, ఆషా, రంజిత, అనిత, నీలవేణి, నయిశెట్టి సత్తిబాబు, మళ్ల లోకేష్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి :
9010973030, 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com